క్లుప్తంగా

26న జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అధికారి, ప్రిన్సిపాల్

నందికొట్కూరు: ఈ నెల 26న నిరుద్యోగుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీ. శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ ఆర్. సునీతతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుమారు 10 ప్రైవేట్ కంపెనీలు వస్తాయని చెప్పారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, ఇంటర్మీడియెట్, డిగ్రీ, బీ.టెక్, పీజీ పూర్తి చేసిన వారు అర్హులన్నారు. మరింత సమాచారం కోసం 91548 30286, 76739 02328 గల సెల్ నెంబర్లను సంప్రదించాలన్నారు.

నాటు సారా విక్రయిస్తే క్రిమినల్ కేసులు



నాటు సారా స్వాధీనం చేసుకున్న టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా తయారు చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఆదివారం పట్టణ పరిధిలోని నీలిషికారి పేటలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సారా తయారు చేసేందుకు సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటు సారా విక్రయిస్తున్న షికారి అవరోసింగ్ నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సరైన రికార్డులు లేని ఆరు ద్విచక్ర వాహనాలను పరిశీలించారు.

ఆలయాలకు పూర్వ వైభవం తీసుకురావాలి



రంగులు వేస్తున్న దృశ్యం

మహానంది: దేవాలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ప్రతి హిందువు తన వంతు కృషి చేయాలని రాష్ట్రీయ ధర్మరక్షా దళ్ జిల్లా అధ్యక్షుడు నవీన్ గౌడ్ అన్నారు. బొల్లవరంలోని గోమాత సమాధి (దేవాలయం) పరిసరాలను ఆర్‌డీడీ, మన నేస్తం కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ సుమారు పదేళ్ల క్రితం గ్రామంలోని దేవుని గోదవు మృతి చెందితే సమాధి కట్టించడం హర్షణీయమన్నారు. గోమాత దేవాలయాన్ని శుభ్రం చేసి, రంగులు వేశామన్నారు. కార్యక్రమంలో గోరక్షక్ విభాగ్ జిల్లా ప్రముఖ్ రామచరణ్, నంద్యాల, మహానంది మండలాల అధ్యక్షులు సతీష్, నాగరాజు, బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు తాడి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరులో వర్షం

ఆత్మకూరు: పట్టణంతో పాటు మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మోస్తరుగా ప్రారంభమై భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి ఉరుములు, మెరుపులు తోడు కావడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. అయితే ఇటీవల రైతులు సాగుచేసిన మొక్కజొన్న, పత్తి, మెట్ట పంటలు ఎండేదశలో వరుణుడు కరుణించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే వర్షం మండలంలో కొన్ని గ్రామాల్లో వర్షం లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్తూరుకు పోటెత్తిన భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారికి ఇష్టమైన చలివిపిండి తయారు చేసి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. అధికారులు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఖరీఫ్ సాగేదెలా?

ఖరీఫ్ సాగు మొదలు కాకముందే ఏడాది క్రితం వరకు ఐదేళ్ల పాటు పంటల సాగు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్థిక సహకారం అందజేయడంతో వ్యవసాయం పండుగలా సాగింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా.. ఇప్పటి వరకు కనీస సాయం చేయకపోవడంతో ప్రస్తుతం పంటల సాగుకు చేతిలో నగదు లేక అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు.

- ప్రభుత్వం నుంచి రైతులకు అందని సాయం
- గతేడాది నుంచి అన్నదాతలకు అందని చేయూత
- గతంలో ఏటా పంటల సాగుకు రైతు భరోసా అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- నేడు ఆర్థిక సహకారంలో లేక సాగుకు అప్పులు చేస్తున్న కర్షకులు



పరమటూరులో సాగుచేసిన మొక్కజొన్న పంట

బండిఆత్మకూరు : అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. రైతుల వేసవి దుక్కులు దున్నుతున్నారు. విత్తనాల సేకరణ పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పెట్టుబడి సాయం మాటే వారిని బాధిస్తోంది. గతంలో సీఎం వైఎస్ జగన్ సాగు కంటే ముందే పెట్టుబడి సాయం అందించారు. కానీ కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించి ఇంత వరకు వాటి ఊసే ఎత్తడం లేదు. దీంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు.

గిట్టుబాటు ధర లేక..

గత ఏడాది పంటలు దిగుబడి ఆశాజనకంగా రాలేదు. వచ్చిన అరకొర ఉత్పత్తులకు మద్దతు ధర లేకపోవడంతో నష్టాలపాలయ్యారు. భూమినే నమ్ముకున్న రైతన్న వాటితో సంబంధం లేకుండా మళ్లీ సాగుకు సన్నద్ధమయ్యాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఏడాదికి రూ.20 వేలు సాయం ఇస్తామని, గిట్టుబాటు ధర, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామంటూ ఇచ్చిన హామీలతో రైతులు మోసపోయారు. ఏడాది తిరిగే లోపే ఆ సాయం ఏపాటిదో అర్థం అయిపోయింది. పెట్టుబడి సాయమందక, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారు. మెట్ట ప్రాంతంలోని రైతులు పత్తి, మిరప, వేరుశనగ, కంది సాగుకు సిద్ధమవుతున్నారు. గత ప్రభుత్వం ఏటా రూ.13,500 రైతుల ఖాతాలలో జమచేసి వారికి భరోసా కల్పించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూపాయి కూడా అందక అల్లాడుతున్నారు.

రుణమివ్వని బ్యాంకులు..

పంట కోసం అప్పుగా తీసుకున్న రుణాలు చెల్లిస్తేనే మళ్లీ కొత్త రుణాలు ఇస్తామంటూ బ్యాంకర్లు మెలికపెడుతున్నారు. బంగారం తాకట్టు పెట్టి పంట రుణాలు తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లిస్తేనే నూతన రుణం ఇస్తామని చెప్పటంతో గత్యంతరం లేని పరిస్థితిలో అధిక వడ్డీలకు తీసుకొచ్చి బ్యాంకులో అప్పులు చెల్లించి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. జూన్ మూడో వారం ముగుస్తున్నా ఇంత వరకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఇస్తామన్న సాయం గురించి ప్రస్తావించకపోవడంతో దిక్కులేనిస్థితిలో పడ్డారు.



బండిఆత్మకూరులో వరి నారు పోసిన దృశ్యం

హామీలను అమలు చేయాలి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి. నమ్మి ఓట్లు వేసిన రైతులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవటం మంచిదికాదు. రైతుల పెట్టుబడిని దృష్టిలో పెట్టుకొని ఇస్తామన్న రూ.20వేలు వెంటనే అందజేయాలి. ఇక పంటలకు మద్దతు ధర కల్పించాలి. ఆ ధరతో కొనుగోళ్లు జరిగేలా చర్యలు చేపట్టాలి. పంటలు నష్టపోతే పరిహారం వెంటనే అందజేసి ఆదుకోవాలి. – జగన్‌మోహన్‌రెడ్డి, రైతు, పరమటూరు

ఆర్‌ఎస్‌కేల ద్వారా ఎరువులు అందించాలి



గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు సహాయ కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన ఎరువులను సబ్సిడీపై అందించాలి. గత ప్రభుత్వం క్రమం తప్పకుండా ప్రతి ఏడాది రైతు భరోసా సొమ్ము అందజేసింది. నేడు సీజన్ ప్రారంభమైనా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. గతేడాది వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నా ఒక్క రూపాయి కూడా సాయం అందించి ఆదుకోలేదు. – దూదేకుల మౌలాలి, సంతజూటూరు

సాయం ఎప్పడిస్తారో తెలియదు



గత ప్రభుత్వంలో వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందే రైతు భరోసా కింద నగదు చేతికొచ్చేది. ప్రస్తుతం జూన్ మూడో వారం దాటుతున్నా రైతులకు ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం గురించి ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడింది. ఈనెల 20న ఇస్తామని సీఎం చంద్రబాబు బహిరంగంగా ప్రకటించారు. 22వ తేదీ కూడా దాటిపోయినా నగదు రైతుల ఖాతాలో జమకాలేదు. అప్పుడు.. ఇప్పుడు అంటూ దాటవేసే సమాధానాలు తప్పితే స్పష్టత లేదు. – పల్లె మహీధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల రైతు విభాగం అధ్యక్షుడు

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ సురేష్‌కుమార్ రెడ్డి

కొత్తపల్లి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని నందికుంట గ్రామంలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. గ్రామంలో సుమారు 15 బైకులకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. అదేవిధంగా అనుమానితుల ఇళ్లు, కళ్లాలు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో ఫుట్ పెట్రోలింగ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో ఎటువంటి అల్లర్లు, గొడవలు, ఘర్షణలు జరగడానికి ఎవ్వరు కారణమైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాటుసారా, అక్రమ మద్యం అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట కొత్తపల్లి ఎస్‌ఐ జయశేఖర్, పాములపాడు ఎస్‌ఐ సురేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

యోగా పేరుతో ప్రజాధనం దుర్వినియోగం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం పేరుతో ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేయడం ఎంత వరకు సబబని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు ప్రశ్నించారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖపట్టణంలో ప్రపంచ యోగా దినోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీని పిలిపించి ప్రజాధనం రూ.కోట్లు ఖర్చు చేయడం దుర్మార్గమన్నారు. గిన్నీస్ బుక్‌లో పేరు నమోదు కోసం సీఎం చంద్రబాబు నందికొట్కూరు ఆర్టీసీ డిపో నుంచి బస్సులను విశాఖపట్టణం తీసుకెళ్లడంతో ప్రజాధనం ఎంత వృథా అవుతుందో ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, కర్ణ, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించండి సార్...



ఎస్సీ బాలికల హాస్టల్‌లో నిరుపయోగంగా మారిన మినరల్ వాటర్ ప్లాంటు

జూపాడుబంగ్లా: స్థానిక ఎస్సీబాలికల హాస్టల్‌లో తాగునీటి సౌకర్యం కల్పించండి సార్ అంటూ బాలికలు వేడుకుంటున్నారు. మూడేళ్ల క్రితం ఎస్సీ బాలికల హాస్టల్‌కు మినరల్‌వాటర్ ప్లాంటు మంజూరైంది. రెండేళ్ల క్రితం ఆ ప్లాంటు మరమ్మతులకు గురవ్వడంతో నేటికీ రిపేరు చేయించకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులకు మినరల్ వాటర్ లేక ఫ్లోరైడ్‌నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొంది. సాంఘిక సంక్షేమశాఖ, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకొని ఎస్సీ బాలికల హాస్టల్‌లో నిరుపయోగంగా మారిన మినరల్‌వాటర్ ప్లాంటుకు మరమ్మతులు చేయించి మంచినీరు అందేలా చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



కోనేరులో భక్తుల స్నానాలు

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. పలు ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం స్థానిక అలంకార మండపంలో శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు కల్యాణోత్సవం పూజలు వైభవంగా జరిగాయి.

ఆదమరిస్తే అంతే!

పాములపాడు: మండలంలోని క్రిష్టారావుపేటలో నుంచి తుమ్మలూరు గ్రామానికి వెళ్లే మలుపులో ఆదమరిస్తే ప్రమాదం బారిన పడినట్టే. నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా డ్రైనేజీ ఏర్పాటు చేసి పైన సిమెంటు పలకలు ఏర్పాటు చేశారు. అయితే మూన్నాళ్లకే సిమెంటు పలక పగిలిపోయింది. అక్కడే మలుపు ఉండటం ప్రమాదకరంగా మారింది. ఇటీవల బీటీ రోడ్డు భూమిపూజ కోసం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గ్రామానికి వచ్చిన సమయంలో ప్రజలు సమస్యను వివరించారు. ఎమ్మెల్యే పీఎస్‌కే కంపెనీ వారితో మాట్లాడారు. వెంటనే సరి చేస్తామని చెప్పినప్పటికీ ఇంకా పరిష్కారం చర్యలు చేపట్టలేదు. కేవలం కాలువ గంతలో ప్రమాద హెచ్చరిక బోర్డు ఉంచి చేతులు దులుపుకున్నారు. పక్కనే సర్వీసు రోడ్డు ఉండటంతో ఏదైనా భారీ వాహనం వస్తే పక్కన నిలబడే పరిస్థితి కూడా లేదు. రాత్రి వేళలో విద్యుత్ లేకపోతే అంధకారంలో ఆదమరిచినా ప్రజలు ప్రమాదబారిన పడక తప్పదు. ఇప్పటికైనా హైవే అధికారులు సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



హైవే రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న డ్రైనేజీ

రైతులు నీటి పన్ను చెల్లించాలి

ఆత్మకూరు: మండలంలోని రైతులందరూ నీటి తీరువ (భూమి శిస్తు) పన్ను చెల్లించాలని తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం నుంచి రైతులు భూమిశిస్తు పన్ను చెల్లించలేదన్నారు. ఈ యేడాది తప్పనిసరిగా నీటితీరువ పన్నులు వసూలు చేసేందుకు రెవెన్యూశాఖ సిద్ధంగా ఉందన్నారు. సిద్ధాపురం, వరదరాజస్వామి ప్రాజెక్టు కింద రైతులతో పాటు ఇందిరేశ్వరం, కొట్టాల చెరువు, కురుకుంద, నల్లకాల్వ, కరివేన గ్రామాలతో పాటు మండలంలోని భూమి కలిగిన అన్ని గ్రామాల రైతులు పన్ను చెల్లించి ఆయా గ్రామాల వీఆర్వోల ద్వారా రసీదు పొందాలన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే రైతులకు డిమాండ్ నోటీస్ అందించామన్నారు. ఐదు సంవత్సరాలకు సంబంధించిన రైతులు చెల్లించే పన్నుకు ఫజలీ కూడా నమోదు చేశామని పేర్కొన్నారు. రైతులు పన్ను చెల్లించి రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీఈఓ చంద్రశేఖర్, తహసీల్దార్ సుభద్రమ్మ ఆదివారం తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవచ్చన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలు

ఆత్మకూరు: పట్టణ శివారులో ఆదివారం జరిగిన రహదారి ప్రమాదంలో నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలు.. పట్టణ సమీపంలోని ఉర్దూ పాఠశాల వద్ద బొలెరో వాహనాన్ని ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆత్మకూరు నుంచి తిరుపతి వైపు వెళ్తున్న, నంద్యాల నుంచి ఆత్మకూరుకు వస్తున్న వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. బొలెరో వాహనం, ఆటో ముందుభాగాలు దెబ్బతిన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాము తెలిపారు.

బొల్లవరంలో కార్డెన్ సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి

మహానంది: గ్రామాల్లో ప్రజల భద్రతే పోలీసుల లక్ష్యమని మహానంది ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బొల్లవరం గ్రామంలో ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు అనుమానితుల ఇళ్లల్లో చేసినట్లు చెప్పారు. చెడు నడత కలిగిన, నేర చరిత్ర ఉన్న వారి ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, ఎవరైనా పాల్పడుతుంటే సమచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.



మహానంది ఆలయ పరిసరాల్లో నల్లటి మేఘాలు

ఊరిస్తున్న మేఘాలు!

మహానంది: ఇటీవల వరుణుడు కరుణ లేకపోవడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే అరటి, పసుపు, పొగాకు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేశారు. అయితే వరుణుడు కరుణించకపోవడంతో పంటల సాగు కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో మహానంది ఆలయం వద్ద ఆదివారం ఆకాశంలో నల్లటి మేఘాలు ఆవరించిన దృశ్యాన్ని సాక్షి కెమెరాలో బంధించింది.

స్థానికులకు 80 శాతం ఉద్యోగాలు కల్పించాలి

బేతంచెర్ల: సిమెంట్ నగర్‌లోని పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు 19 రోజుల దీక్షల అనంతరం యాజమాన్యంతో చర్చలు సఫలం కావడంతో విరమించారు. ఆదివారం సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్‌ను పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు మోజెస్, రామ సుబ్బయ్య, అక్తర్, రంగన్న, శ్రీనివాసులు, నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని.. స్థానిక యువతకు 80 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ డిమాండ్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

గోస్పాడు: మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన ఠాగూర్ (22) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యువకుడికి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితం పై విరక్తి చెంది మండల కేంద్రమైన గోస్పాడు సమీపంలో శనివారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక మృతి చెందాడు. ఈమేరకు తల్లి మరియమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ రెడ్డి తెలిపారు.

స్తంభం.. భయం భయం!

- ఇష్టారాజ్యంగా ఆర్డీఎస్ఎస్ విద్యుత్ స్తంభాల ఏర్పాటు
- కంకర వేయకుండానే మట్టితో పూడ్చుతున్న వైనం
- ప్రారంభానికి ముందే ఒరిగిపోతున్న స్తంభాలు
- భయాందోళనకు గురవుతున్న గ్రామీణ ప్రజలు



ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాన్ని జేసీబీతో సరిచేస్తున్న దృశ్యం



ఆర్డీఎస్ఎస్ స్కీం కింద తాటిపాడులో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

జూపాడుబంగ్లా: పల్లెలకు నిత్యం త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసేందుకుగాను రీ వ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సిస్టంలో భాగంగా గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఐదు అడుగుల మేర గుంతను తవ్వి రెండు అడుగుల మేర కంకరను వేసి విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ కంకర వేయకుండా కరెంటు స్తంభాలను పాతుతున్నారు. విద్యుత్ స్తంభాలు ప్రారంభానికి ముందే ఒరిగిపోతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరా అయితే ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. దీనికి తోడు నివాసగృహాల మధ్యన, గ్రామాల ప్రధాన రహదారుల పక్కన ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకొని పనులను నాణ్యతగా చేపట్టేలా చేయటంతో పాటు గృహాల మధ్యన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.



కంకర వేయకుండా మట్టితోనే ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం